మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 216
పేజీలు : 3

శుక్రవారం 06.03.2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


## సమస్యలకు సైనిక చర్యలు పరిష్కారం కాదు

- యుద్ధాలకు ముగింపు పలకాలి: మోదీ



**టి మీడియా, మార్చి 4 , ఢిల్లీ బ్యూరో :** ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, భద్రతా ఉద్రిక్తతల నేపథ్యంలో శాంతి, సంభాషణల ద్వారానే సమస్యలకు పరిష్కారం సాధ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయని, సైనిక చర్యలకన్నా చర్చలు, రాజనీతే శాశ్వత పరిష్కారమని అన్నారు. దిల్లీలోని హైదరాబాద్ హౌస్?లో గురువారం ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్?తో కలిసి నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రస్తుతం ప్రపంచం అస్థిరత, అనిశ్చితి దశలో ఉంది. ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయి. చట్టపరమైన వ్యవస్థ, సంభాషణ, రాజనీతిపై భారత్, ఫిన్లాండ్ నమ్మకం ఉంచుతున్నాయి" అని తెలిపారు.

పరస్పర గౌరవం ద్వారా సమస్యలను ఏ సమస్యకూ సైనిక ఘర్షణలతో పరిష్కారం రాదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ యుద్ధమైనా, పశ్చిమాసియా సంక్షోభమైనా వీలైనంత త్వరగా ముగియాలని, శాంతి నెలకొల్పే ప్రతి ప్రయత్నానికి భారత్ మద్దతు ఇస్తుందని మోదీ తెలిపారు. అంతర్జాతీయ చట్టాలు, పరస్పర గౌరవం, శాంతియుత జీవనం ఆధారంగా పరిష్కారాలు కనుగొనాలని సూచించారు ప్రధాని.

### రాష్ట్రం నుంచి రాజ్యసభ అభ్యర్థులుగా...

## అభిషేక్ మనుసింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి

- నామినేషన్ దాఖలు



**టి మీడియా, మార్చి 5, హైదరాబాద్ బ్యూరో :** రాష్ట్రం నుంచి రాజ్యసభ అభ్యర్థులుగా అభిషేక్ మనుసింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్న మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి నామపత్రాలు అందించారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. నామినేషన్ వేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పెద్ద ఎత్తున అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్నారు. రాష్ట్రంలో ఖాళీ అయిన రెండు స్థానాలకు కాంగ్రెస్ అధిష్ఠానం మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డికి అవకాశం కల్పించింది.రాజ్యసభ అభ్యర్థిగా అవకాశం కల్పించిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు. అవకాశం కల్పించిన అధిష్ఠానం పెద్దలందరికీ కృతజ్ఞతలు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో రాజ్యసభలో పోరాడతా."– వేం నరేందర్‌రెడ్డి, రాజ్యసభ అభ్యర్థిరాష్ట్ర నేతలు ఇప్పటివరకు నాకు ఇచ్చిన సహకారం భవిష్యత్తులో కూడా ఇస్తారని ఆశిస్తున్నా. రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ వేశాను. ఖర్గే, రాహుల్, సోనియా, కేసీ వేణుగోపాల్‌కు ధన్యవాదాలు. తెలంగాణ తరపున రాజ్యసభకు రెండోసారి వెళ్లడం అదృష్టంగా భావిస్తున్నా. రాష్ట్ర ప్రయోజనాల కోసం నావంతు కృషి చేస్తా." – అభిషేక్ సింఘ్వీ, రాజ్యసభ అభ్యర్థి

### 16 మంది ప్రయత్నం

రాష్ట్రం నుంచి ఖాళీ అయిన రెండు రాజ్యసభ స్థానాల భర్తీ కోసం కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘ కసరత్తు చేసింది. భారీ సంఖ్యలో ఆశావహులు రంగంలోకి దిగడంతో వారి వివరాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఏఐసీసీకి నివేదించారు. ఆశావహుల రాజకీయ ప్రస్థానం, పార్టీ పట్ల విధేయత చేసిన సేవలు, సామాజిక సమీకరణ తదితర అంశాలను అధిష్ఠానానికి ఇచ్చిన నివేదికలో పొందుపరచినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తం 16 మంది వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు రాజ్యసభ స్థానాల కోసం ప్రయత్నించారు. రెడ్డి, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన సీనియర్ నేతలు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. సీనియర్ నాయకుడు వి.హనుమంతు రావు, మాజీ మంత్రి చిన్నారెడ్డి వంటి నేతలు నేరుగా అధిష్ఠానాన్ని కలిసి తమకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అయితే చివరికి అధిష్ఠానం నిర్ణయంలో రెండు ప్రధాన ప్రమాణాలు ప్రాధాన్యతలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. జాతీయ, రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందుకెళ్లినట్లు సమాచారం.

### దాదాపు అరగంటపాటు చర్చలు

జాతీయ స్థాయిలో పార్లమెంటులో బలమైన వాదనలు వినిపించే నేత అవసరమని భావించిన అధిష్ఠానం ఏఐసీసీ కోటా కింద అభిషేక్ మను సింఘ్వీని తిరిగి రాజ్యసభకు పంపాలని నిర్ణయించింది. న్యాయవాది, రాజ్యాంగ నిపుణుడిగా ఆయనకు ఉన్న అనుభవం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక రెండో స్థానాన్ని రాష్ట్ర నాయకత్వానికి వదిలేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయాన్ని తెలుసుకుని తుది నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల రెండో తేదీన వికారాబాద్ పర్యటనకు వచ్చిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్?లతో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దాదాపు అరగంటపాటు చర్చలు జరిపారు. అప్పుడే అభ్యర్థుల మెరిట్ అంశం ప్రధానంగా ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. ఆ చర్చల్లో వేం నరేంద్ర రెడ్డి పేరు బలంగా వినిపించింది. తరువాత నిన్న మరోసారి ఫోన్ ద్వారా రాష్ట్ర ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లతో కేసీ వేణుగోపాల్ అభిప్రాయాలు సేకరించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వేం నరేంద్ర రెడ్డి అభ్యర్థిత్వంపై ఎలాంటి అభ్యంతరాలు లేవని స్పష్టత వచ్చిన తర్వాతే తుది నిర్ణయం తీసుకున్నారు.

### ఆయన పాత్ర వెలకట్టలేనిదని

సీఎం రేవంత్ రెడ్డితో కలిసి 2017లో కాంగ్రెస్ పార్టీలో చేరిన వేం నరేంద్ర రెడ్డి అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర రాజకీయాల్లో కీలక స్థానాన్ని సంపాదించుకున్నారు. పార్లమెంటు ఎన్నికలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉపఎన్నిక జూబ్లీహిల్స్ ఉపఎన్నిక, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల సమయంలో తెర వెనుక వ్యూహరచనలో ఆయన పాత్ర వెలకట్టలేనిదని రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. అంతేకాదు ప్రభుత్వం, పార్టీ మధ్య అనుసంధాన కర్తగా కూడా కీలకంగా వ్యవహరించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వివాదాస్పద అంశాల్లో సైతం జోక్యం చేసుకుని సమన్వయం చేస్తూ ముందుకు వెళ్లగల నాయకుడిగా ఆయనకు ఉన్న ఇమేజ్ కూడా అధిష్ఠానం దృష్టిలో ఉన్నట్లు సమాచారం. ఈ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని జాతీయ స్థాయిలో సింఘ్వీ, రాష్ట్ర స్థాయిలో వేం నరేంద్ర రెడ్డిని ఎంపిక చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు స్పష్టం చేశాయి.

# రక్తపాతం తప్పదు

- ఇరాన్ మతగురువు హెచ్చరికలు
- అమెరికా దాడిలో ఇరాన్ నౌక మునిగిందని ఆరోపణ







**టీ మీడియా, మార్చి 5, ఢిల్లీ బ్యూరో :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకూ పెరుగుతున్న వేళ ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య పరిస్థితులు యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. సైనిక చర్యలు, పరస్పర హెచ్చరికలు, క్షిపణి దాడులతో ప్రాంతమంతా ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో ఇరాన్ ప్రభుత్వ మీడియా, అధికారుల వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి.

### దేశ ఐక్యతను కాపాడుకోవాలి

ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్‌లో ప్రసారమైన సందేశంలో ప్రముఖ మత గురువు అయితొల్లా అబ్దుల్లా జవాది అమోలీ తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇజ్రాయెల్, అమెరికా నేతలపై రక్తపాతం తప్పదని హెచ్చరించారు. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరును ప్రస్తావిస్తూ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. దేశ ఐక్యతను కాపాడుకోవాలని, శత్రువులపై కఠినంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

### అమెరికా తప్పక అనుభవిస్తుంది

ఇదే సమయంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి కూడా అమెరికాపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. శ్రీలంక తీరానికి సమీపంలో అమెరికా జలాంతర్గామి దాడిలో ఇరాన్ నౌకాదళానికి చెందిన ఐఆర్ఐఎస్ డెన ఫ్రిగేట్ మునిగిపోయిందని ఆరోపించారు. ఇది అంతర్జాతీయ జలాల్లో జరిగిన దాడి అని, అమెరికా దీని ఫలితాలను అనుభవిస్తుందని హెచ్చరించారు. ఈ ఘటనతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత ముదిరాయని అన్నారు.

### ఖమేనీ అంత్యక్రియలకు ఏర్పాట్లు

మరోవైపు ఇరాన్ సుప్రీం లీడర్ సయ్యద్ అలీ ఖమేనీ అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడిలో మరణించారని ప్రభుత్వ అనుబంధ మీడియా మరోసారి పేర్కొంది. ఆయన మృతదేహాన్ని గ్రాండ్ మోసల్లా ఆఫ్ టెహ్రాన్ వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. మూడు రోజులపాటు అంతిమ వీడ్కోలు కార్యక్రమాలు, అంత్యక్రియల శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలాదిమంది భక్తులు, మద్దతుదారులు హాజరయ్యే అవకాశం ఉంది.

### డిమోనా అణు కేంద్రం లక్ష్యంగా చేసుకుంటామని స్పష్టం

ఇక సైనిక రంగంలో కూడా పరిస్థితులు ఉద్రిక్తంగానే ఉన్నాయి. ఇరాన్ హెచ్చరికలు జారీ చేస్తూ, ఇజ్రాయెల్‌పై దాడులు కొనసాగితే డిమోనా అణు కేంద్రం లక్ష్యంగా చేసుకుంటామని స్పష్టం చేసింది. దీనికి ప్రతిగా ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ సైన్యం ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ ప్రకారం, ఇరాన్ మరోసారి బాలిస్టిక్ క్షిపణి దాడులు జరిపింది. కేంద్ర ఇజ్రాయెల్, జెరూసలేం ప్రాంతాల్లో ఎయిర్ రైడ్ సైరన్లు మోగడంతో ప్రజలు ఆశ్రయ కేంద్రాలకు పరుగులు తీశారు. అమెరికా, ఇజ్రాయెల్ పర్యవేక్షణ వ్యవస్థలు దెబ్బతిన్నాయంటూ!

అదే సమయంలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఆపరేషన్ ట్రూ ప్రామిస్–4 పేరిట మరో దాడి దశ ప్రారంభించినట్లు ప్రకటించింది. క్షిపణులు, డ్రోన్లతో అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యాలపై దాడులు కొనసాగుతున్నాయని తెలిపింది. ఇరాన్ ప్రభుత్వ అనుబంధ ఛానల్ ప్రెస్ టీవీ సమాచారం ప్రకారం, అమెరికా––ఇజ్రాయెల్‌కు చెందిన రాడార్ వ్యవస్థలు ధ్వంసమయ్యాయని, వారి పర్యవేక్షణ వ్యవస్థలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. అలాగే బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయం సహా పలు కీలక ప్రాంతాలు లక్ష్యంగా మారినట్లు వెల్లడించారు.

### బంకర్లలో ఆశ్రయం


క్షిపణి దాడులతో ఇజ్రాయెల్‌లో అనేక ప్రాంతాల్లో గంటల తరబడి



అలర్ట్ కొనసాగుతోంది. ప్రజలు బంకర్లలో ఆశ్రయం పొందుతున్నారు. ఇరాన్ వర్గాలు మాత్రం ఇది ప్రారంభమే, రాబోయే రోజుల్లో దాడులు మరింత తీవ్రంగా ఉంటాయంటూ హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికే ఆరు రోజులుగా కొనసాగుతున్న ఈ ఘర్షణ మరింత విస్తరించే ప్రమాదం ఉందని నిపుణులు భావిస్తున్నారు. అమెరికా కూడా తమ ఆపరేషన్ ఇప్పుడే మొదలైందని చెప్పడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది. దీంతో పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణకు అంతర్జాతీయ సమాజం జోక్యం అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## ఎక్కువ మంది పిల్లల్ని కంటే రూ.25 వేలు

- శాసనసభలో సీఎం చంద్రబాబు ప్రకటన



**టి మీడియా, మార్చి 5 , అమరావతి బ్యూరో :** జనాభా నిర్వహణపై దృష్టి సారించాల్సిన సమయం వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. లేకపోతే భవిష్యత్తులో చాలా సమస్యలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై అసెంబ్లీలో సీఎం ప్రకటన చేశారు. 1.5 ఉన్న టీఎఫ్ఆర్‌ను 2.1కు తీసుకెళ్లటం మన లక్ష్యమని వెల్లడించారు. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లల్ని కంటే కాన్పు సమయంలోనే రూ.25 వేలు ఇస్తామని ఈ నగదు పురస్కారం గేం ఛేంజర్ కానుందని భావిస్తున్నామని అన్నారు. జనాభా నిర్వహణపై ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో చర్చలు జరపాలని ఆ చర్చల తర్వాత పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ రూపొందిస్తామని సీఎం వెల్లడించారు.

ఏప్రిల్ 1 నుంచి కొత్త పాలసీని అమలు చేస్తామని, పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ అమలు చేసిన మొదటి రాష్ట్రంగా ఏపీ నిలుస్తుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఇద్దరి కంటే ఎక్కువ ఉంటే ఎన్నికల్లో పోటీకి అర్హత లేదనే చట్టం రద్దు చేశామని, ఇద్దరి కంటే తక్కువ మంది పిల్లలు ఉంటే పోటీకి అనర్హుల్ని చేయాల్సి వస్తుందేమోనని వ్యాఖ్యానించారు. పాపులేషన్ కంట్రోల్ నుంచి పాపులేషన్ కేర్ దిశగా వెళ్తున్నామని చెప్పారు. మాతృత్వ, శక్తి, నైపుణ్య, క్షేమ, సంజీవని అనే 5 అంశాలు తీసుకున్నామని అలానే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు 75 శాతం నుంచి 50 శాతానికి తగ్గించాలని చెప్పారు. 90 లక్షల మంది జంటల్లో 11 లక్షల మంది ఇన్‌ఫెర్టిలిటి సమస్యతో ఉన్నారని,

మిగతా 3లో..

# లొంగిపోనున్న మావోయిస్టులు

- జాబితాలో 100 మందికిపైగా



**టిమీడియా, మార్చి5, హైదరాబాద్ బ్యూరో :** సాయుధ మావోయిస్టులు పెద్ద సంఖ్యలో ఒకట్రెండు రోజుల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందు లొంగిపోనున్నారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ఇది అతి పెద్ద లొంగుబాటు కానుందని సమాచారం. 100 మందికి పైగా మావోయిస్టులు జనజీవనస్రవంతిలో కలవనుండగా వారిలో పీఎల్?జీఏ కేడర్‌తో పాటు అగ్రనేతల అంగరక్షకులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.దాదాపు వంద మందికి పైగా సాయుధులు పోలీసులు సమక్షంలో జనజీవన స్రవంతిలో కలవడంతో పాటు 60కి పైగా ఆయుధాలను అప్పగించనున్నట్లు సమాచారం. 2002లో ఉమ్మడి రాష్ట్రంలో జనశక్తి కరీంనగర్ జిల్లా కార్యదర్శి రణధీర్ నేతృత్వంలో 46 మంది నక్సలైట్లు లొంగిపోవడమే ఇప్పటివరకు ఉన్న రికార్డు. గతంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పదుల సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయినా వారంతా మిలిటెంట్లు, సానుభూతిపరులు మాత్రమే ప్రస్తుతం లొంగిపోనున్నది. మావోయిస్టు పార్టీలో కీలకమైన మిలిటరీ శిక్షణ పొందిన పీఎల్?జీఏ కేడరే కావడంతో ప్రాధాన్యం సంతరించుకొంది.ఇటీవలే మావోయిస్టు సెంట్రల్ మిలిటరీ కమిషన్ కార్యదర్శి తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీతో పాటు అగ్రనేతలు మల్లా రాజిరెడ్డి ఎలియాస్ సంగ్రామ్, బడే చొక్కారావు ఎలియాస్ దామోదర్, నూనె నర్సింహారెడ్డి ఎలియాస్ గంగన్నల లొంగుబాటు ద్వారా మావోయిస్టు కార్యకలాపాల నియంత్రణలో పట్టు నిరూపించుకున్న తెలంగాణ పోలీసులు తాజాగా జరగనున్న లొంగుబాటుతో తమదైన ముద్రను సొంతం చేసుకోనున్నారు. లొంగిపోనున్న సాయుధ మావోయిస్టుల్లో పై నలుగురు అగ్రనేతలకు అంగరక్షకులుగా వ్యవహరించిన సాయుధులతో పాటు కీలకమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కేడర్ ఉన్నారు. తెలంగాణ, చత్తీస్‌గఢ్ రాష్ట్ర కమిటీ సౌత్‌బస్తర్ కమిటీలకు నేతృత్వం వహించిన వారూ ఉన్నారు.

వీరిలో సింహభాగం చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందినవారే ఉన్నారు.ఆపరేషన్ కగార్ ఉధృతమైన నేపథ్యంలో 2024 ఆగస్టులో మావోయిస్టు పార్టీ అగ్ర నేతలు గణపతి, బస్వరాజ్, దేవీ సహా అందుబాటులో ఉన్న కేంద్రకమిటీ సభ్యులు సమావేశమై కీలక తీర్మానం చేసుకున్నారు. చత్తీస్‌గఢ్ అడవుల్లో ఉన్న మావోయిస్టు కేడర్ అర్బన్ షెల్టర్లకు వెళ్లి తలదాచుకోవాలని నిర్ణయించుకున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విధించిన 2026 మార్చి 31 డెడ్లైన్ గడువు ముగిసిన తర్వాత దండకారణ్యానికి తిరిగి వచ్చి తదుపరి కార్యాచరణపై సమీక్షించుకోవాలనే నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే పలువురు మావోయిస్టులు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి తలదాచుకున్నారు. అనంతర పరిణామాల్లో అక్కడి పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.మరోవైపు తెలంగాణాలోని ములుగు, ఆసిఫాబాద్ అడవుల్లోనూ పలువురు మావోయిస్టులు రోజుల తరబడి మకాం వేశారు. ఈ నేపథ్యంలో కొద్దిరోజుల క్రితం ఆసిఫాబాద్ అడవుల్లో 20మందికి పైగా మావోయిస్టుల కదలికలు గుర్తించిన నిఘావర్గాలు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. గ్రేహౌండ్స్ దళాలతో కలిసి కూంబింగ్ చేసిన క్రమంలో.. మావోయిస్టుల ఆచూకీ లభించడంతో గంటలపాటు సంప్రదింపులు జరిపిన అనంతరం వారిని లొంగిపోయేలా చేశారు. తాజాగా వారి లొంగుబాటు చూపించనున్నట్లు తెలిసింది.

**జనజీవన స్రవంతిలో 591 మంది**

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సమావేశం అయ్యారు. రాష్ట్రంలో ఈమధ్య అజ్ఞాతాన్ని వీడి బయటకు వచ్చిన మావోయిస్టు నాయకుల విషయం కూడా చర్చకు వచ్చింది. మిగిలిన మావోయిస్టు నాయకుల లొంగుబాటు, వారి పునరావాసం సంబంధించిన విషయాలను సీఎం ఈ సమావేశంలో వివరించారు. రెండు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో గణనీయమైన మార్పులు వచ్చాయని మొత్తం 591 మంది మావోయిస్టులు తెలంగాణ రాష్ట్రంలో ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిసిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కాలంలో పలువురు మావోయిస్టు అగ్రనేతలు కూడా సాధారణ జీవితం గడిపేందుకు ముందుకు రావడం శుభపరిణామమని, వీరందరికీ ప్రభుత్వం తరపున కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు కేంద్రం అందించే మద్దతు గురించి కూడా చర్చించారు.

## రాజ్యసభకు నీతీశ్ కుమార్

- సీఎం పదవి నుంచి వైదొలగనున్నట్లు ప్రకటన

2లో..

# సరిహద్దులో ఎన్‌కౌంటర్



**టీ మీడియా, మార్చి 5, దంతెవాడ:** ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ–బీజాపూర్ సరిహద్దు వెంబడి దట్టమైన అటవీ–పర్వత ప్రాంతంలో మావోయిస్టులతో జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న భద్రతా దళాలు ఒక సాయుధ తిరుగుబాటుదారుడిని మట్టుబెట్టాయని పోలీసు అధికారులు గురువారం తెలిపారు. మావోయిస్టును భైరామ్‌గఢ్ గ్రూపులోని ఏరియా కమిటీ సభ్యుడు రాజేష్ పూనెంగా గుర్తించారు. అతని తలపై ఐదు లక్షల రూపాయల ప్రభుత్వ రివార్డు ఉందని అధికారులు తెలిపారు.గీడం పోలీస్ స్టేషన్ పరిధిలోని గుమ్లానార్, గిర్సాపర, నెల్గోడ గ్రామాల మధ్య ఉన్న కొండ ప్రాంతంలో ఆయుధాలు, 'నక్సలైట్' సామాగ్రి దాచిపెట్టినట్లు పోలీసులకు విశ్వసనీయ నిఘా సమాచారం అందిన తర్వాత మార్చి 3న ఈ ఆపరేషన్ ప్రారంభమైంది. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, బస్తర్ ఫైటర్స్ సభ్యులతో కూడిన సంయుక్త బృందం మధ్యాహ్నం 12:30 గంటల ప్రాంతంలో బయలుదేరింది. చుట్టుపక్కల అడవిలో ముమ్మర తనిఖీలు చేస్తూ ముందుకు సాగుతున్న సమయంలో, భైరామ్‌గఢ్ ఏరియా కమిటీకి చెందిన 8 నుండి 10 మంది సాయుధ మావోయిస్టుల నుండి అకస్మాత్తుగా భారీ కాల్పులు జరిగాయి. భద్రతా సిబ్బంది మావోయిస్టులను లొంగిపోవాలని హెచ్చరికలు జారీ చేశారు. మావోయిస్టులు దూకుడు పెంచడంతో ఆత్మరక్షణ కోసం ఎదురుకాల్పులు జరిపినట్లు అధికారులు పేర్కొన్నారు.ఈ ప్రతిఘటన మావోయిస్టులకు భారీ షాక్ ఇచ్చింది. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలంలో పరిశీలించిన అనంతరం ఒక మావోయిస్టు మృతదేహంతో పాటు ఆయుధాలు, సంబంధిత వస్తువులు లభించాయి. వాటిలో ఒక ఎస్ఎల్ఆర్ రైఫిల్, ఒక ఐఎన్ఎస్ఏఎస్ రైఫిల్, ఒక మ్యాగజైన్‌తో కూడిన పిస్టల్, ఒక వాకీ–టాకీ సెట్, ఒక ఎస్ఎల్ఆర్ మ్యాగజైన్, ఆరు లైవ్ ఎస్ఎల్ఆర్ రౌండ్లు, ఒక ఖాళీ ఎస్ఎల్ఆర్ కార్ట్రిడ్జ్ కేసు, మూడు ఐఎన్ఎస్ఏఎస్ మ్యాగజైన్‌లు, ఐదు లైవ్ ఐఎన్ఎస్ఏఎస్ రౌండ్లు, 18 ఐఎన్ఎస్ఏఎస్ మిస్‌ఫైర్ రౌండ్లు, మూడు ఖాళీ ఐఎన్ఎస్ఏఎస్ కార్ట్రిడ్జ్ కేసులు, ఐదు లైవ్ పిస్టల్ రౌండ్లు, ఒక ఖాళీ పిస్టల్ కార్ట్రిడ్జ్ కేసు, ఒక పౌచ్ ను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. దంతెవాడ జిల్లా పోలీసులు ప్రకటించిన నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ విజయవంతంగా ముగిసిందని సూచిస్తూ, భద్రతా సిబ్బందిలో ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

# పీఎఫ్ అకౌంట్‌లో 25 శాతం ఉండాల్సిందే

## • ఉద్యోగుల భద్రతకు కొత్త మార్గదర్శకాలు

**టి మీడియా, మార్చి 5, హైదరాబాద్ బ్యూరో :** ఉద్యోగుల భవిష్య భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్)-2026, ఉద్యోగుల పింఛను పథకం (ఈపీఎస్)-2026లను అమల్లోకి తీసుకురానుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఈపీఎఫ్-1952, ఈపీఎస్-1995 పథకాల స్థానంలో ఇవి రానున్నాయి. ఇటీవల జరిగిన ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) కేంద్ర ట్రస్టీ బోర్డు సమావేశంలో ఈ కొత్త పథకాలకు ఆమోదం లభించింది. కేంద్ర కార్మిక శాఖ త్వరలో గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసి, ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ కొత్త పథకాల ద్వారా ఉద్యోగుల పొదుపు భద్రతను పెంచడం, పింఛను వ్యవస్థను బలోపేతం చేయడం, అలాగే ఉపసంహరణ విధానాలను సులభతరం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

### కనీస నిల్వ నిబంధన - ముఖ్యమైన మార్పు

ఈపీఎఫ్--2026లో అత్యంత కీలకమైన మార్పు కనీస నిల్వ నిబంధన. కొత్త విధానం ప్రకారం ప్రతి ఉద్యోగి తన భవిష్య నిధి ఖాతాలో కనీసం 25 శాతం మొత్తం నిల్వగా ఉంచాల్సి ఉంటుంది. ఉద్యోగి, యజమాని చెల్లించిన మొత్తాలు, వాటిపై వచ్చిన వడ్డీ కలిపి ఏర్పడే మొత్తం భవిష్య నిధి నిల్వగా పరిగణిస్తారు. అందులో 25 శాతం కనీస నిల్వగా ఉంచి, మిగిలిన 75 శాతం మొత్తంలో నుంచి మాత్రమే ఉపసంహరణలు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు పీఎఫ్‌లో కనీస నిల్వ నిర్వహించాలనే నిబంధన లేకపోవడం వల్ల కొందరు ఉద్యోగులు తమ మొత్తం పొదుపును ముందుగానే ఉపసంహరించుకునే పరిస్థితులు ఉండేవి. కొత్త నిబంధన వల్ల ఉద్యోగుల భవిష్య భద్రతకు కొంత రక్షణ లభిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఉప సంహరణలకు మూడు కేటగిరీలు ఉన్నాయి. కొత్త పథకంలో ఉద్యోగుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఉప సంహరణలను మూడు కేటగిరీలుగా విభజించారు.

**కేటగిరీ-1**

ఈపీఎఫ్ చందాదారుగా చేరిన తర్వాత 12 నెలల సేవ పూర్తి చేసిన ఉద్యోగులు అనారోగ్యం, విద్య, వివాహం వంటి అవసరాల కోసం ఉప సంహరణలు చేసుకోవచ్చు. అనారోగ్యం కోసం ఏడాదికి మూడుసార్లు, విద్య కోసం మొత్తం సేవా కాలంలో పదిసార్లు, వివాహం కోసం ఐదుసార్లు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది.

**కేటగిరీ-2**

గృహ అవసరాలకు సంబంధించిన ఉపసంహరణల కోసం కనీసం 12 నెలల చందా చెల్లింపు సేవ ఉండాలి. ఇంటి కొనుగోలు, నిర్మాణం, గృహ రుణ చెల్లింపు లేదా మరమ్మతుల కోసం ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఈ కేటగిరీలో మొత్తం సేవా కాలంలో ఐదుసార్లు ఉపసంహరణకు అనుమతి ఇచ్చారు. ఇప్పటి వరకు ఇది రెండుసార్లకే పరిమితం అయ్యేది.

**కేటగిరీ-3**

కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఒక సంవత్సరం సేవ పూర్తి కాకపోయినా ఉప సంహరణకు అనుమతి ఉంటుంది. అయితే కనీసంగా ఉంచాల్సిన 25 శాతం నిల్వను మినహాయించి మిగిలిన మొత్తాన్ని మాత్రమే తీసుకోవచ్చు.

### పూర్తి ఉపసంహరణకు అవకాశాలు

కొత్త పథకంలో ఉద్యోగులకు కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో పూర్తి పీఎఫ్ ఉపసంహరణ చేసుకునే అవకాశం ఉంటుంది. ఉద్యోగి 55 సంవత్సరాలు పూర్తి అయినప్పుడు ఆ వయసు కన్నా ముందే ఉద్యోగాన్ని వదిలిపెట్టినప్పుడు విదేశాల్లో ఉద్యోగం కోసం వెళ్లినప్పుడు ఉద్యోగం నుంచి తొలగించిన సందర్భంలో ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగి తన భవిష్య నిధి ఖాతాలో ఉన్న మొత్తం నిల్వను ఉపసంహరించుకోనే అవకాశం ఉంటుంది.

### యజమానులపై కఠిన నిబంధనలు

ఈపీఎఫ్-2026లో యజమానులపై కూడా కఠిన నిబంధనలు విధించారు. యజమాని పీఎఫ్‌కు చెల్లించాల్సిన తన వాటాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉద్యోగి వేతనం నుంచి మినహాయించకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే యజమాని చెల్లించిన వాటాను ఉద్యోగి నుంచి తిరిగి తీసుకునే ప్రయత్నాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ నిర్ణయం ఉద్యోగుల హక్కులను రక్షించడంలో కీలకంగా భావిస్తున్నారు.

"ఈపీఎఫ్‌లో 25 శాతం కనీస నిల్వ నిబంధన మంచి నిర్ణయమే. దీనివల్ల ఉద్యోగులు భవిష్యత్తు కోసం కొంత మొత్తాన్ని తప్పనిసరిగా నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే కనీస పింఛను పెంపు, గరిష్ఠ వేతన పరిమితి పెంపు, సార్వత్రిక పింఛను పథకం వంటి అంశాలపై కేంద్ర ట్రస్టీ బోర్డు చర్చ జరపకపోవడం కొంత నిరాశ కలిగించే అంశం." జె.శ్రీనివాస్, విశ్రాంత ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్

## అక్రమ ఇసుక రవాణాను అణిచివేస్తాం

• జిల్లా ఎస్పీ సునిత రెడ్డి





**టీ మీడియా,మార్చి 5, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకం, రవాణా చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష లేదు ఇసుక అక్రమ రవాణా చేసే వాహనాలను సీజ్ చేసి ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అణిచివేస్తామని జిల్లా ఎస్పీసునిత రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. తూముకుంట వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో, జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు వనపర్తి సీఐ, సుగంధ రత్నం, వీపనగండ్ల ఎస్సై, రాణి, పోలీసులతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 9 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, తెలిపారు. గత మూడు రోజుల వ్యవధిలోనే జిల్లాలో 30 కేసులు నమోదు ఒక వీపనగండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఇసుక 15 ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఎక్కడైనా అక్రమ ఇసుక తవ్వకం లేదా రవాణా జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, చట్ట అమలులో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. ప్రజల సహకారంతోనే అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టగలమని ఆమె పేర్కొన్నారు.

## క్రీడా ప్రాంగణం మరుగుదొడ్లు పునర్ నిర్మాణం




**టీ మీడియా, మార్చి 5,పెబ్బేరు :**గురువారం పెబ్బేరు పట్టణంలోనీ12వ వార్డులో కౌన్సిలర్ వల్లపు రెడ్డి సౌజన్య దిలీప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సొంత ఖర్చులతో హై స్కూల్ గ్రౌండ్ లో విద్యార్థుల క్రీడ ప్రాంగణం విద్యార్థుల సౌకర్యార్థం క్రీడ ప్రాంగణానంలో కంపచెట్లు తొలగించి బుల్ డోజర్ సహాయంతో క్రీడా ప్రాంగణాన్ని చదును చేయించి టాయిలెట్స్ పునర్నిర్మాణం చేయించడం జరిగింది. విద్యార్థులు కౌన్సిలర్ తో హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీచర్ జి నరసింహ గౌడ్, మండ్ల కురుమూర్తి ,మౌనిక ,ఎం జయ జడ్ పి హెచ్ ఎస్ ,పెబ్బేరు మణెమ్మ, సాయి గీత, బాలమని ,అరుణ కుమారి ,వాణిశ్రీ ,డి కృష్ణయ్య ,ఎం నరసింహ,డి బిసన్న, జీ రవి ,బసాల వెంకటేశ్వర రెడ్డి ,విష్ణువర్ధన్ రెడ్డి ,రమేష్ ,సురేష్, సదానందం ,సత్యనారాయణచారి పాల్గొన్నారు.

## పీఎం ముద్రా యోజన పై అవగాహన కార్యక్రమం



**టీ మీడియా, మార్చి 5, వనపర్తి ప్రతినిధి, :**జిల్లా పరిశ్రమల కేంద్రం, ఎంట్రపరెన్యూర్ డెవలప్మెంట్ సెంటర్ వనపర్తి ద్వారా వనపర్తి జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల వేదికగా పీఎం ముద్రా యోజన, పీఎం ఈజీపీ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు పాల్గొని పీఎం ముద్రా, పీఎం ఈజీపీ స్కీంల పై ఎంతో చక్కటి అవగాహన పొందారు. జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జ్యోతి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న పీఎం ముద్రా, పీఎం ఈజిపి స్కీంలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఉపాధి కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు చివరి ఏడాది విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని సూచించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ శివ కుమార్ మాట్లాడుతూ లబ్ధిదారులు ఏ విధంగా అప్లై చేయాలి అలాగే ఎంత శాతం సబ్సిడీ వస్తుంది, బ్యాంకుకు సమర్పించవలసిన డాక్యుమెంట్లను ఏ విధంగా తప్పులు లేకుండా తయారు చేయించుకొవాలనే అంశం వివరించారు. ఈ డి సి మేనేజర్ శ్రీకాంత్ అసిస్టెంట్ మేనేజర్ హైమావతి మాట్లాడురు రిసోర్స్ పర్సన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ స్కీం లోని వివిధ రకాల లోన్లు, వాటి పరిమితుల గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య కృతజ్ఞతలు తెలియజేశారు కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ దామోదర్, బోధన, బోధన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ కు సన్మానం



**టీ మీడియా ,మార్చి5,పెబ్బేరు :**గురువారం పెబ్బేరు పట్టణంలోని 8వ వార్డ్ బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ యువనాయకుడు బుసిరెడ్డి శివప్రసాద్ రెడ్డి ని గురువారం పెబ్బేరు మండలం బునియాదిపురం గ్రామానికి చెందిన యువకుల బృందం శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించడం జరిగింది. మీలాంటి ప్రతిభావంతులైనా యువనాయకులు ఇప్పుడు ఉన్న రాజకీయాలకు చాలా అవసరమని వార్డు ప్రజలకు స్నేహ భావంతో వార్డ్ సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో బు నియాదిపురం గ్రామ యువత పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు



**టీ మీడియా, మార్చి5,పెబ్బేరు :**పెబ్బేరు మున్సిపాలిటీలోని 3వ వార్డుకు చెందిన విలేఖరి పెద్ది బాలరాజు శారద కూతురు వివాహ మహోత్సవం కొత్తకోట పట్టణంలోని పీజేఆర్ ఫంక్షన్ హాల్ లో గురువారం కాంగ్రెస్ మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అలాగే కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ వర్ధన్ రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేసాగర్ రంజిత్ కుమార్ మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడ్ ఆశన్న కటికల వినోద్ కుమార్ భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

## వాట్సాప్ ద్వారా టెన్త్ హాల్ టికెట్లు



**టి మీడియా, మార్చి 5, హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ రాష్ట్రంలో మార్చి 14 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవ్వనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం ఓ గుడ్?న్యూస్ అందించింది. టెన్త్? విద్యార్థుల హాల్?టికెట్లను వాట్సాప్? ద్వారా పొందచ్చని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీహరి వెల్లడించారు. ఇందుకోసం ఏ వాట్సాప్? నంబర్?కు మెసేజ్? చేయాలి? ఏయే వివరాలు నమోదు చేయాలి అనే విషయాలను ఆయన తెలిపారు. హాల్?టికెట్? ఏవిధంగా సింపుల్?గా డౌన్?లోడ్? చేసుకోవాలో స్టెప్? బై స్టెప్ తెలుసుకుందాం.

హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకునేందుగా ఈ స్టెప్స్? ఫాలో అవ్వండి ముందుగా మీ ఫోన్ నుంచి 8096958096 అనే వాట్సప్ నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేయండిఅప్పుడు 'వెల్‌కమ్‌టూ మీ సేవ' అని వస్తుంది

తర్వాత (ssc hall ticket march-2026) అని ఎంటర్ చేయాలి

ఇప్పుడు ఎస్?ఎస్?సీ హాల్? టికెట్ ఓపెన్ సర్వీస్ అనే లింక్? కనిపిస్తుంది

ఓపెన్ సర్వీస్‌పై క్లిక్ చేయండి. ఇప్పుడు ఎస్ఎస్‌సీ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ అనే ఆప్షన్ వస్తుంది. మీ జిల్లా, పాఠశాల పేరు ఎంచుకోండి, మీ పుట్టిన తేదీ వివరాలు ఎంటర్ చేస్తే హాల్?టికెట్ వస్తుంది. దాన్ని ఇంటర్‌నెట్ సెంటర్ లేదా మీ సేవలో ప్రింట్ తీసుకోవచ్చు.

హాల్?టికెట్లపై క్యూఆర్? కోడ్

విద్యార్థుల హాల్?టికెట్లను పాఠశాలల లాగిన్‌లో కూడా వాటిని ఉంచామని, ఈ నెల 5వ తేదీ నుంచి ఆయా పాఠశాలల హెచ్ఎంలు/ప్రిన్సిపాళ్ల నుంచీ పొందొచ్చని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీహరి తెలిపారు. ప్రభుత్వ పరీక్షల విభాగం వెబ్‌సైట్ నుంచి కూడా విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే సౌలభ్యం ఉందని పేర్కొన్నారు. ఈసారి కొత్తగా హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్?ను ముద్రించామన్నారు. దాని ఆధారంగా విద్యార్థులు తమ ఇళ్ల నుంచి పరీక్షా కేంద్రం ఎంత దూరంలో ఉంది? వెళ్లేందుకు ఎంత టైమ్ పడుతుంది? చిరునామా తదితర వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. హాల్‌టికెట్లో ఏమైనా పొరపాట్లు ఉంటే ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ఇదే

పదోతరగతి పరీక్షలు మార్చి 14వ తేదీ నుంచి జరగనున్నాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమై, మధ్యాహ్నం 12.30 వరకు జరుగుతుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్?ను ఇప్పటికే విడుదల చేసిన విషయం విధితమే. ఏ రోజు ఏ పరీక్ష ఉందనే విషయాన్ని ఇప్పుడు తెలుసుకుందాం.

మార్చి 14వ తేదీన ప్రథమ భాషా పరీక్ష,మార్చి 18న సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష,

మార్చి 23 థర్డ్ లాంగ్వేజ్,మార్చి 28 గణితం,ఏప్రిల్ 2 సైన్సు పార్ట్-1 ఫిజిక్స్,

ఏప్రిల్ 7 బయాలజీ,ఏప్రిల్ 13 సాంఘిక శాస్త్రం పరీక్ష,ఏప్రిల్ 15 ఒకేషనల్ కోర్సు(వృత్తివిద్యా కోర్సు) పేపర్-1 భాషా పరీక్ష,ఏప్రిల్ 16 ఒకేషనల్ కోర్సు(వృత్తివిద్యా కోర్సు) పేపర్-2 లాంగ్వేజ్ పరీక్ష.

విద్యార్థులకు నిపుణుల సూచనలు ఇవే

పరీక్షలు సమీపిస్తున్నందున ఇప్పటి వరకు చదివినవే మరోసారి రివిజన్? చేసుకోవాలి. ఏవైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలి. ప్రీవియస్? ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. పరీక్షకు ముందురోజే ఎగ్జామ్?సెంటర్? ఎక్కడ ఉందో చూసుకోవడం మంచిది. లేదంటే చివరలో కంగారు పడాల్సి వస్తుంది. మీకు బాగా తెలిసిన ప్రశ్నలకే సమాధానాలకు మొదట రాయడం ఉత్తమం. గణితంలో ఫార్ములాలను అండర్?లైన్ చేయాలి. పరీక్షల సమయంలో తేలికైన ఆహారం తీసుకోవడం మంచిది. రోజూ తగినంత నీరు తీసుకోవాలి. పరీక్ష ఎలా రాస్తానో అనే ఆందోళన వీడి నేను బాగా రాయగలను అనే ఆత్మవిశ్వాసంతో ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

## రాజ్యసభకు నీతీశ్ కుమార్

• సీఎం పదవి నుంచి వైదొలగనున్నట్లు ప్రకటన



**టిమీడియా, మార్చి5,పాట్నా :** బిహార్ సీఎం నీతీశ్ కుమార్(75) సంచలన ప్రకటన చేశారు. ఈసారి రాజ్యసభ ఎన్నికల కోసం తాను నామినేషన్ దాఖలు చేస్తానని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో ఏర్పడబోయే కొత్త ప్రభుత్వానికి తన పూర్తి సహకారాన్ని అందిస్తానని తెలిపారు. నీతీశ్ చేసిన ఈ ప్రకటనతో, ఆయన సీఎం పదవి నుంచి వైదొలగనున్నట్లు క్లారిటీ వచ్చింది. 2005 నుంచి నాన్ స్టాప్‌గా బిహార్ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్న నీతీశ్, త్వరలోనే దేశంలోని పెద్దల సభలోకి ఎంట్రీ ఇవ్వనున్నారు. దీంతో బిహార్ రాజకీయ చరిత్రలోనే తొలిసారిగా ఒక బీజేపీ నేతకు ముఖ్యమంత్రి పదవి దక్కేందుకు లైన్ క్లియర్ అయిందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

ప్రజావిశ్వాసపు శక్తి వల్లే సేవలను

### నా కోరిక.. అందుకే రాజ్యసభకు వెళ్తున్నా

"పార్లమెంటరీ జీవితాన్ని ప్రారంభించిన తొలినాళ్లలో నా మనసులో ఒక కోరిక ఉండేది. బిహార్‌లోని అసెంబ్లీ, శాసన మండలితో పాటు దేశంలోని లోక్‌సభ, రాజ్యసభల్లోనూ సభ్యుడిగా కావాలి అని నేను అనుకునే వాడిని. ఈ ఆశయాన్ని నెరవేర్చుకునేందుకు నేను రాజ్యసభకు వెళ్లాలని అనుకుంటున్నాను. అందుకే ఈసారి జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నాను. నేను రాజ్యసభకు వెళ్లినా, బిహార్ ప్రజలతో నా అనుబంధం అలాగే ఉంటుంది. ఈ విషయాన్ని నేను బిహార్ ప్రజలకు పూర్తి నిజాయితీతో చెబుతున్నాను. బిహార్‌ను వికాస పథంలో ముమ్ముందుకు తీసుకెళ్లే విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదు. ఇందుకు నావంతు పూర్తి సహకారాన్ని అందిస్తూనే ఉంటాను. తదుపరిగా బిహార్‌లో ఏర్పడబోయే కొత్త ప్రభుత్వానికి నా తరపున పూర్తి సహకారాన్ని అందిస్తాను" అని సీఎం నీతీశ్ వెల్లడించారు.

### రాజ్యసభకు నీతీశ్ ఎన్నిక లాంఛనమే

బిహార్‌లోని 5 రాజ్యసభ సీట్లకు మార్చి 16న ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు నామినేషన్ దాఖలు కోసం గురువారమే లాస్ట్ డేట్. నామినేషన్ దాఖలు చేయడానికి కొన్ని గంటల ముందు, ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలకు తెలుపుతూ సీఎం నీతీశ్ కీలక ప్రకటనను విడుదల చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో అధికార ఎన్‌డీఏ కూటమికి స్పష్టమైన మెజారిటీ ఉంది. సరిపడా సంఖ్యలో ఎమ్మెల్యేలు ఉన్నారు. దీంతో రాజ్యసభకు నీతీశ్ ఎన్నిక అనేది లాంఛనమే. 2025లో జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో నీతీశ్ సారథ్యంలో ఎన్‌డీఏ కూటమి అఖండ విజయాన్ని సాధించింది. ఆ వెంటనే పదోసారి సీఎంగా నీతీశ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ పరిణామం జరిగిన ఏడాదిలోనే సీఎం పదవిని వదిలేసి, రాజ్యసభకు వెళ్లాలని ఆయన నిర్ణయించుకోవడం గమనార్హం.

### జనతాదళ్ పార్టీతో మొదలైన నీతీశ్ ప్రస్థానం

తొలిసారిగా 1985లో జనతాదళ్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా నీతీశ్ కుమార్ గెలిచారు. అనంతరం నీతీశ్, జార్జ్ ఫెర్నాండేజ్ కలిసి 1994లో సమతా పార్టీని స్థాపించారు. 1996లో నీతీశ్ తొలిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. వాజ్‌పేయి ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా ఆయనకు అవకాశం లభించింది. 2005లో బిహార్ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి ఘన విజయాన్ని సాధించింది. దీంతో తొలిసారిగా సీఎం అయ్యే అవకాశం నీతీశ్‌కు దక్కింది. అప్పట్లో నీతీశ్‌కు చెందిన జేడీయూ, బీజేపీ కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. 2010 ఎన్నికల్లోనూ మళ్లీ ఎన్‌డీఏ కూటమే నెగ్గింది. కానీ 2013 జూన్‌లో నీతీశ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. బీజేపీతో దోస్తీకి కటీఫ్ చెప్పి, లాలూ ప్రసాద్ యాదవ్‌కు చెందిన ఆర్‌జేడీ, కాంగ్రెస్‌లతో చేతులు కలిపారు. ఈ పరిణామంతో రాష్ట్రంలోని ఎన్‌డీఏ కూటమి సర్కారు కొత్త సీఎంగా జితన్ రాం మాంఝీని నియమించారు.

### ఆకస్మిక జంప్‌లతో రాజకీయ సంచలనాలు


2015లో జరిగిన ఎన్నికల్లో జేడీయూ, ఆర్‌జేడీ, కాంగ్రెస్‌లతో కూడిన కూటమి విజయాన్ని సాధించింది. అయితే 2017లో నీతీశ్ కీలక నిర్ణయాన్ని తీసుకున్నారు. ఆర్‌జేడీ, కాంగ్రెస్‌లకు కటీఫ్ చెప్పి, మళ్లీ ఎన్‌డీఏ కూటమిలో చేరిపోయారు. ఈనేపథ్యంలో 2020లో జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో కలిసి నీతీశ్ పార్టీ జేడీయూ పోటీ చేసింది. ఈ ఎన్నికల్లోనూ ఎన్‌డీఏ కూటమిని విజయమే వరించింది. కానీ 2022 ఆగస్టులో నీతీశ్ సంచలన ట్విస్ట్ ఇచ్చారు. ఆయన అకస్మాత్తుగా ఎన్‌డీఏ కూటమిని వదిలేసి, ఆర్‌జేడీ, కాంగ్రెస్‌లతో చేతులు కలిపారు. ఈ దోస్తీ రెండేళ్లే కొనసాగింది. 2024 జనవరిలో నీతీశ్ మరోసారి ఎన్‌డీఏ కూటమిలో జాయిన్ అయ్యారు. 2025లో జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇంకోసారి ఎన్‌డీఏ కూటమి విజయఢంకా మోగించింది. వరుసగా 10వసారి సీఎం అయ్యే అవకాశాన్ని నీతీశ్ పొందారు.

## శివపార్వతుల కళ్యాణోత్సవం




**టీ మీడియా ,మార్చి 5, టేక్మాల్ ప్రతినిధి:**మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని తంపులూరు గ్రామంలో శివపార్వతుల కల్యాణోత్సవం... మండల పరిధిలోని తంపులూరు గ్రామంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు అర్చన అభిషేకాలను నిర్వహించారు. ఆలయ ఆవరణంలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు కల్యాణోత్సవం అనంతరం గ్రామంలో విగ్రహాలను ఊరేగింపు చేశారు. ఊరేగింపు సందర్భంగా స్వాములు చేసిన విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పూజా కార్యక్రమాలకు విచ్చేసిన భక్త జనానికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. భజన గీతాలతో శివాలయం మారుమరోగింది. ఇందులో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళా సమైక్య భవనానికి శంకుస్థాపన



**టీ మీడియా ,మార్చ్ 5, టేక్మాల్ ప్రతినిధి:**మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోనిపాల్గొన్న కాంగ్రెస్ మండల అధ్యక్షులు నిమ్మ రమేష్ , స్థానిక నాయకులు అచ్చన్నపల్లి గ్రామంలో మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. గౌరవ ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాల మేరకు, 10 లక్షల రూపాయల వ్యయంతో , నిర్మించనున్న మహిళా సమైక్య భవనానికి గురువారం , శంకుస్థాపన నిర్వహించారు. గ్రామ పెద్దల సమక్షంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, భవన నిర్మాణానికి ముగ్గు పోశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మ రమేష్ మాట్లాడుతూ, మహిళా సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించిందని, ఈ భవనం అందుబాటులోకి వస్తే మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో మెంబర్ మల్లారెడ్డి, ఎస్. యాదగౌడ్, మాజీ జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ గుండ్ల రాజయ్య, గ్రామ సర్పంచ్ సాయిలు గౌడ్, ఉప సర్పంచ్ మడే విజయ పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు శ్రీశైలం, దారప్ప, యేసు, స్వరూప, కవిత, శేఖర్ గౌడ్, భాస్కర్ , గ్రామ పెద్దలు లివర్ బాగయ్య, సత్తయ్య, పాపయ్య, లక్ష్మయ్య, దశరథ్, యాదయ్య, గోపాల్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మరియు మహిళా సంఘాల సభ్యులు తమ గ్రామానికి భవనాన్ని మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు



## వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**టీ మీడియా, మార్చి 5, వనపర్తి బ్యూరో :** అడిషనల్ కలెక్టరు,(జోగులాంబ గద్వాల జిల్లా)మంతెన.శ్రీదేవి లక్ష్మీనారాయణ కుమారుడు అభినవ్ వివాహం డాక్టర్.ప్రణవి తో ఎస్.పి.ఆర్ శ్రీరస్తు కన్వెన్షన్,హైదరాబాద్ నందు ఘనంగా జరిగింది. ఇట్టి వివాహానికి మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి, మహబూబ్నగర్ జిల్లా మాజీ కలెక్టర్ శ్రీ పురుషోత్తం రెడ్డి , వనపర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ పలుస రమేష్ గౌడ్ , మాజీ కౌన్సిలర్లు వాకిటి శ్రీధర్, తిరుమల్ నాయుడు, రంగాపురం కృష్ణారెడ్డి,ఇట్టి వివాహ వేడుకలలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు.




## కెరీర్ మార్గదర్శక అవగాహన సదస్సు

**టీ మీడియా మార్చ్ 5 ,ఆత్మకూరు:**వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని ఎం.వి. రామన్ ఉన్నత పాఠశాల సీబీస్ ఈ లో ప్రిన్సిపల్ ఆన్సీ శ్రీధర్ అధ్యక్షతన కెరీర్ మార్గదర్శక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా. ఎం. శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి, పదవ తరగతి అనంతరం అభ్యసించే ఉన్నత విద్యలో రాణించి జీవితంలో స్థిరపడాలంటే సమయపాలన, క్రమశిక్షణ, విలువలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్యాబోధ చేసిన గురువులను ఎప్పటికీ మరవకూడదని తెలిపారు. విద్యార్థులు గురువుల మార్గదర్శకత్వంలో ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత ఉద్యోగాలను సాధించి సమాజానికి దేశానికి సేవ చేయాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ధనిక్ భారత్ విద్యా సంస్థల గణిత శాస్త్ర అధ్యాపకుడు రవీంద్రారెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి అనంతరం ఇంటర్మీడియట్, ఆ తరువాత ఇంజనీరింగ్ మరియు వైద్య విద్యలో ఉన్న అవకాశాలు, భవిష్యత్తు దిశగా విద్యార్థులు చేయవలసిన కృషి గురించి వివరించారు. అలాగే భౌతిక శాస్త్ర అధ్యాపకుడు శివశంకర్ మాట్లాడుతూ ఉన్నత విద్యావకాశాలు మరియు వాటి ప్రయోజనాలను విద్యార్థులకు సవివరంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## కరాటేలో సత్తా చాటిన మాంటిసోరీ హై స్కూల్

**టీ మీడియా మార్చి 5,పెబ్బేరు:** గురువారం పెబ్బేరుమున్సిపాలిటీ పరిధిలో గల మాంటిస్సోరి హై స్కూల్ మూడవ తరగతి విద్యార్థులు కె శ్రీచేతన్ ఎస్ జననీ 6 వ రాష్ట్ర స్థాయి ఇన్విటేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ జూనియర్ విభాగ పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబరిచి సర్టిఫికెట్ మెడల్స్ పొందడం జరిగింది ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డి రాజేందర్ గౌడ్ వారిని అభినందించి సర్టిఫికెట్ మెడల్స్ తో సత్కరించి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోఉచిత వైద్య శిబిరం



**టి మీడియా,మార్చి 5,ఎండపల్లి:**ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక వంద రోజుల కార్యక్రమంలో భాగంగా అంబారిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్ సి లో ఈనెల 6 శుక్రవారం అనుభవజ్ఞులైనడాక్టర్లచే వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.లవ కుమార్ తెలిపారు.ఉదయం 9:30 గంటల నుండి ప్రారంభమయ్యే ఈ శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు పరీక్షలు నిర్వహిస్తారు అనిఈ స్పెషల్ క్యాంపులో ఈ క్రింది విభాగాల నిపుణులు పాల్గొంటారు అని తెలిపారు.లి జనరల్ మెడిసిన్: అన్ని రకాల సాధారణ వ్యాధుల పరీక్షలు.లి స్త్రీ ప్రసూతి వైద్యం గైనకలజీస్టు: మహిళల ఆరోగ్య సమస్యలు.లి శిశువైద్యం, పెడిఆత్రిక్స్: చిన్న పిల్లల ఆరోగ్య పరీక్షలు.లి దంత వైద్యం డెంటల్: పంటి సమస్యల పరిష్కారం.లి కీళ్లు,ఎముకల వ్యాధులు ఆర్థోపెడిక్స్:ఎముకల బలహీనత,నొప్పుల పరీక్షలు. నేత్ర వైద్యం,ఓఫతల్మలజీ: కంటి చూపు సమస్యలనిర్ధారణ. ఎండపల్లి మండల పరిధిలోని ప్రజలు,స్వశక్తి సంఘాల మహిళలు,వృద్ధులు,పిల్లలు ఈఅవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ లవన్ కుమార్ కోరారు.

## ఏసీబీకి పట్టుబడ్డ జీహెచ్ఎంసీ ఎగ్జామినర్

**టీ మీడియా, మార్చి 5, హైదరాబాద్ :** జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో అకౌంట్ సెక్షన్ విభాగంలో ఎగ్జామినర్గా పనిచేస్తున్న సూర్య వంశీ సంతోష్ ( లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్హ్యాండెడ్గా పట్టుబడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సిటీ రేంజ్ 2 ఏసీబీ అధికారులు కార్యాలయంపైమెరుపుదాడిచేసి రూ.35వేలులంచంతీసుకున్నఎగ్జామినర్ను పట్టుకున్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతులను ఉన్నతాధికారులకు పంపాలని కోరగా అందుకు రూ.40 వేలు డిమాండ్ చేసి రూ.35వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి ఎగ్జామినర్ను పట్టుకుని అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరుచగా జ్యుడిషియల్ రిమాండ్కు తరలించారు.





## కుప్పకూలిన గుడ్డు ధరలు..

### -రోజుకు రూ.5 కోట్ల నష్టం!

**టీ మీడియా, మార్చి 5, నామక్కల్ :** మధ్యప్రాచ్యంలో రగులుతున్న ఇరాన్ -- ఇజ్రాయెల్ యుద్ధ జ్వాలలు ఇప్పుడు తమిళనాడులోని నామక్కల్ కోళ్ల పరిశ్రమను కోలుకోలేని దెబ్బ తీశాయి. భారతదేశపు అతిపెద్ద గుడ్ల ఉత్పత్తి కేంద్రమైన నామక్కల్ నుంచి ఎగుమతులు పూర్తిగా నిలిచిపోవడంతో, స్థానిక రైతులు, ఎగుమతిదారులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారు. యుద్ధం కారణంగా సముద్ర మార్గాలు, గగనతలంపై ఆంక్షలు విధించడంతో, నామక్కల్ నుంచి గల్ఫ్ దేశాలకు (యూఏఈ, ఒమన్, ఖతార్) జరిగే గుడ్ల సరఫరా మార్చి 1 నుంచి పూర్తిగా ఆగిపోయింది

**పడిపోయిన ధరలు.. కుదేలైన రైతులు**

ఎగుమతులు నిలిచిపోవడంతో రోజుకు సుమారు రూ.5 కోట్ల మేర నష్టం వాటిల్లుతోంది. యుద్ధం కారణంగా సుమారు 1 కోటి గుడ్లు కోల్డ్ స్టోరేజీలు, ప్యాకింగ్ సెంటర్లలోనే ఉండిపోయాయి. ఇవి త్వరగా పాడయ్యే వస్తువులు కావడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఎగుమతులు ఆగిపోవడంతో ఆ నిల్వలన్నీ స్థానిక మార్కెట్కు మళ్లాయి. దీనివల్ల దేశీయంగా గుడ్ల ధరలు భారీగా పడిపోయాయి. నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ గుడ్డు ధరను రూ.4.30 గా నిర్ణయించినప్పటికీ, నష్టాలను తగ్గించుకోవడానికి రైతులు రూ.3.50 కే విక్రయించాల్సి వస్తోంది. ఒక గుడ్డు ఉత్పత్తికి రైతుకు రూ.4.50 ఖర్చవుతుండగా, అమ్మకపు ధర అంతకంటే తక్కువగా ఉండటం కోళ్ల ఫారాల యజమానులను అప్పుల ఊబిలోకి నెడుతోంది.ఈ సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని నామక్కల్ ఎగుమతిదారులు కోరుతున్నారు. అమెరికా, ఇజ్రాయెల్ -- ఇరాన్ దేశాలతో దౌత్యపరమైన చర్చలు జరిపి, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు సురక్షిత మార్గాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. యుద్ధం ప్రభావం కేవలం గుడ్లపైనే కాకుండా, ఇతర వ్యవసాయ ఉత్పత్తులపై కూడా పడింది. తిరుచ్చి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లే కూరగాయలు, పండ్లు, ఇతర నిత్యావసర వస్తువుల సరఫరా కూడా నిలిచిపోయింది.

# వేట్లపాలెం విస్ఫోటనం

### • 28కి చేరిన మృతుల సంఖ్య



**టి మీడియా, మార్చి 5 , సామర్లకోట :** కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం ఘటనలో మృతుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలో కాకినాడ జీజీహెచ్?లో చికిత్స పొందుతున్న మరో ఇద్దరు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుల్లో పెద్దాపురం కొండయ్యపేటకు చెందిన మోర్తా శ్రీను (30), చౌడేశ్వరీ నగర్కు చెందిన వెంకటలక్ష్మీ (69) ఉన్నారు. వీరితో బాణసంచా పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 28కు చేరింది.

### పెరుగుతున్న మృతుల సంఖ్య

కాకినాడ జిల్లా బాణసంచా తయారీ కేంద్రంలో ఫిబ్రవరి 28 శనివారం రోజు మధ్యాహ్నం 2 గంటలకు భారీ పేలుడు సంభవించింది. ఈ విస్ఫోటనంలో అదేరోజు 20 మంది ఆహుతయ్యారు. ఆ తర్వాత చికిత్స పొందుతున్న వారిలో ఒక్కొక్కరు ప్రాణాలొదులుతూ నేటికి మృతుల సంఖ్య 28కి చేరింది. కాగా మరికొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.

### కార్మికులు బయటకు రాలేక కాలిపోయారు

వేట్లపాలెంలో కొన్నేళ్లుగా సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ పేరిట బాణాసంచా తయారీ సాగుతోంది. రోజూలాగే కార్మికులు టపాసులు తయారీలో నిమగ్నం అయ్యారు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో పేలుళ్లు సంభవించాయి. పెద్ద మొత్తంలో టపాసులు నిల్వ ఉండడంతో విస్ఫోటం ఆగలేదు. కార్మికులు బయటకు రాలేక కాలిపోయారు. 10 మంది పురుషులు, 10 మంది మహిళలు సజీవ దహనం అయ్యారు. కొందరివి కాళు ్లంటే చేతులు లేవు, చేతులుంటే కాళ్లు లేవు. కొన్ని శరీరభాగాలే మిగిలాయి. పెను విస్ఫోటం నుంచి 10 మంది గాయాలతో బయటపడగా వారిలో కొందరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఊపిరి విడిచారు. మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నారు.

### తప్పుడు విధానంలో సల్ఫర్ వినియోగించడం

చిన్నసాటి నిర్లక్ష్యం వేట్లపాలెంలో భారీ ప్రమాద ఘటనకు కారణమైనట్లు తెలుస్తోంది. చిచ్చుబుడ్డీల్లో మందును దట్టించిన క్రమంలో ఇనుప దిమ్మతో మోదడంతో నిప్పు రవ్వలు రేగి పక్కనున్న బాణసంచా ముడిసరుకులో పడింది. క్షణాల్లో మంటలు వ్యాపించడం, అక్కడే భారీగా నిల్వలున్న బాంబులన్నీ ఒక్కసారి పేలడంతో భారీ విస్ఫోటం సంభవించింది. సల్ఫర్ తప్పుడు విధానంలో వినియోగించడం కూడా ప్రమాదానికి కారణమని అధికారులు గుర్తించారు.

### బాధ్యులపై సస్పెన్షన్ వేటు

ఇదిలా ఉండగా మరోవైపు బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనకు బాధ్యులైన అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ఘటనపై ప్రాథమిక విచారణ చేపట్టి పెద్దాపురం ఆర్డీఓ కె. శ్రీరమణి, రాజమహేంద్రవరం అసిస్టెంట్ కార్మిక కమిషనర్, కాకినాడ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్గా వ్యవహరిస్తున్న బీఎస్. ఎం. వల్లి పై సస్పెన్షన్ వేటు వేసింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న నివేదికల మేరకు తక్షణం వారిని ఉద్యోగం నుంచి తొలగించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. భద్రతా చర్యలను పాటించడంలో పెద్దాపురం ఆర్డీవో కె. శ్రీరమణి విఫలమైనట్లు గుర్తించి సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే.

### వారి ఆస్తులు జప్తు చేస్తాం

బాణసంచా పేలుళ్ల ప్రమాదంలో నిర్వాహకుల ఆస్తులు జప్తు చేసి వాటిని బాధితులకు అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. రాష్టంలో ఇటీవల జరిగిన బాణసంచా పేలుళ్ల ప్రమాదాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని ఆమె పేర్కొన్నారు. శాసనసభలో ఏపీ అగ్నిమాపక సేవల చట్టం సవరణ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు, సభ ఆమోదించాక ఆమె మాట్లాడారు. 'అగ్ని ప్రమాద నివారణ చర్యలకు సంబంధించి చట్టంలో మార్పులు చేస్తున్నాం. ఆధునిక భవన నిర్మాణాలు, బహుళ అంతస్తులు పెరగడంతో చట్టంలో మార్పులు అనివార్యమయ్యాయి. నిబంధనలు అతిక్రమిస్తే భవన ప్రాంగణాన్ని సీజ్ చేసి చర్యలు తీసుకుంటాం' అని హోంమంత్రి హెచ్చరించారు.

## హైదరాబాద్లో
# కల్తీ నెయ్యి పట్టివేత

### - నిందితుడు అరెస్టు

**టి మీడియా, మార్చి 5, హైదరాబాద్ బ్యూరో :** హైదరాబాద్? నగరంలో కల్తీనెయ్యి కలకలం రేపింది. కల్తీ నెయ్యి విలువ సుమారు రూ.18 లక్షలు ఉంటుందని సమాచారం. మొత్తం 460 కిలోల కల్తీ నెయ్యి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో నిందితుడు జునైద్ హుస్సెన్?ను అరెస్టు చేశారు.



### నెయ్యిలా వాసన వచ్చేందుకు

నగరంలో కల్తీ నెయ్యి తయారు చేస్తున్న స్థావరంలో బుధవారం హైదరాబాద్ టాస్క్ఫోర్స్ పోలీసులు సోదాలు నిర్వహించారు. పామాయిల్, మీగడ, ప్రమాదకరమైన రసాయనాలతో తయారు చేసిన 460 కిలోల నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు జునైద్ హుస్సేన్ (26)ను అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్ భోలానగర్కు చెందిన జునైద్ ఫ్రైడ్ డెయిరీ పేరుతో అనుమతి తీసుకొని ఇంటినే అడ్డాగా మార్చుకున్నజునైద్ హుస్సేన్, గేదె, ఆవు, పాల నుంచి మీగడ సేకరించి దానిలో పామాయిల్, వనస్పతిలను, ఇతర రసాయనాలతో దీనిని తయారు చేస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. నెయ్యిలా వాసన వచ్చేందుకు రసాయనాలను ఉపయోగించేవాడు. వీటిని ప్యాకెట్లుగా మార్చి నాణ్యమైన నెయ్యిగా చెబుతూ తక్కువ ధరకు శుభకార్యాలకు, హోటళ్లకు భారీ ఎత్తున విక్రయించేవాడు.

### కల్తీ నెయ్యి, తయారీ యంత్రాలు సీజ్

కొద్దినెలలుగా సాగుతున్న ఈ కల్తీపై టాస్క్ఫోర్స్ డీసీపీ అందె శ్రీనివాసరావుకు సమాచారం అందింది. ఆయన నేతృత్వంలో ఇన్స్పెక్టర్లు వెంకటేశ్, ప్రవీణ్కుమార్, ఎస్సైలు విజయానంద్, చందన, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. రూ.18.26 లక్షల విలువైన 460 కిలోల కల్తీ నెయ్యి, 70 కేజీల కల్తీ మిశ్రమం, సుమారు 3,260 కేజీల మీగడ, 28 డబ్బాల వనస్పతిని స్వాధీనం చేసుకున్న పోలీసులు కల్తీ నెయ్యి, తయారీ యంత్రాలు సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఇంట్లో వాడే నెయ్యి నాణ్యమైనదో లేదో కొన్ని పద్ధతుల ద్వారా తెలుసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.నెయ్యి స్వచ్ఛతను నిర్ధారించేందుకు స్టవ్?పై ఉంచి వేడిచేస్తే సువాసన వచ్చినట్లయితే అది నాణ్యమైన నెయ్యి అని అర్థం. స్వచ్ఛమైన నెయ్యి వేడిచేస్తే అంతగా పొగరాదు. కల్తీది అయితే మాత్రం పొగ ఎక్కువగా వస్తుంది. కాలిన వాసన వస్తుంది. ఇలా వచ్చిందంటే ఆ నెయ్యిలో ఏదైనా పదార్థాలు కలిపినట్లుగా అర్థం చేసుకోవాలి.నెయ్యి స్వచ్ఛతను పరీక్షించేందుకు ఓ గ్లాసు గోరువెచ్చని నీటిని తీసుకోవాలి. అందులో కొంత నెయ్యి వేసి బాగా కలపాలి. నాణ్యమైన నెయ్యి అయితే ఆ ద్రావణంలో పూర్తిగా కరిగిపోతుంది. కల్తీ నెయ్యి అయితే మాత్రం నీటిపై తేలిపోయి విడిపోయినట్లుగా ఉంటుంది. మలినాలు కనిపిస్తాయి.పైన వివరించిన రెండు పద్ధతులే కాకుండా మరికొన్ని విధాలుగా కూడా నెయ్యి నాణ్యతను పరీక్షించవచ్చు. ఇందుకోసం తెల్లటి గుడ్డపై కొద్ది పరిమాణంలో నెయ్యిను వేయండి. కొన్ని సమయం పాటు అలా ఉంచండి. నాణ్యమైన నెయ్యి అయితే అది ఎండిపోయిన తర్వాత మరకలు లాంటివి ఏవీ కనిపించవు. ఒక వేళ గుడ్డపై ఏవైనా అవశేషాలు, మరకలు లాంటివి కనిపించినా అది కల్తీ అయ్యిందని తెలుసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.నెయ్యి నాణ్యతను పరీక్షించేందుకు కొన్ని గంటల పాటు దానిని ఫ్రిజ్?లో ఉంచండి. అది నాణ్యమైనది అయితే ఐస్? ముద్దలా గడ్డకడుతుంది. అందులో ఎలాంటి పగుళ్లు కనిపించవు. ఒక వేళ అది కల్తీది అయినట్లయితే పొరలు పొరలుగా కనిపిస్తుంది. ఇది తక్కువ నాణ్యతకు సంకేతంగా నిపుణులు వివరిస్తున్నారు.నాణ్యమైన నెయ్యి రుచికరంగా ఉంటుంది. లేత బంగారు రంగులో ఉండేటువంటి నెయ్యి సువాసను కలిగి ఉంటుంది. అయితే కల్తీ నెయ్యి మాత్రం చేదుగా ఉంటుంది. టేస్ట్?లో కూడా తేడాను గమనించవచ్చు. పైన వివరించిన విధంగా మీరు కొన్ననెయ్యికల్తీదోస్వచ్ఛమైనదోపరీక్షించుకోవచ్చు.

## .ఎక్కువ మంది పిల్లల్ని కంటే రూ.25 వేలు

11 లక్షల మంది సంతాన సాఫల్యానికి ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుందని చెప్పారు.

### ఆరోగ్య సంరక్షణపై శిక్షణ

టీనేజ్ ప్రెగ్నెన్సీ 8.80 శాతం ఉందని దీన్ని 3 శాతానికి తగ్గించాలని సీఎం చంద్రబాబు చెప్పారు. పనిచేసే మహిళల కోసం వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్, పిల్లలకు బేబీ కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని, ఇంక భార్య మూడో కాన్పు ఉంటే భర్తకు 2 నెలలు సెలవు ఇస్తామని వెల్లడించారు. మహిళతో పాటు భర్త కూడా పిల్లల సంరక్షణ బాధ్యతలు చూడాలని చెప్పారు. 60 ఏళ్లు దాటిన వారు కూడా పని చేసుకునే అవకాశాలు కల్పిస్తామని అన్నారు. రిటైర్ కాబోయే 50 వేల మంది ఉద్యోగులను గుర్తించి ఆరోగ్య సంరక్షణపై శిక్షణ ఇస్తామని తద్వారా వారు రిటైరైన తర్వాత కూడా ఏదైనా పని చేసి సంపాదించే అవకాశం ఉంటుందని తెలిపారు. చైల్డ్ కేర్ విభాగాన్ని విస్తరిస్తున్నామని 10 వేల మంది సర్టిఫైడ్ కేర్ టేకర్స్ని సిద్ధం చేస్తామని సీఎం వెల్లడించారు.ఇప్పటి వరకూ కుటుంబ నియంత్రణకు ప్రాధాన్యం ఇచ్చామని ఇకనుంచి పాపులేషన్ మేనేజ్మెంట్ గురించి చర్చ చేస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఇప్పుడు డ్రాఫ్ట్ పాలసీ రూపొందిస్తున్నామని, నెల రోజుల పాటు చర్చ తర్వాత తుదిరూపు ఇస్తామని వివరించారు. సంతానోత్పత్తి రేటు 2.1 ఉంటే సుస్థిర ప్రగతి ఉంటుందని అలానే దీనికంటే ఎక్కువగా ఉంటే జనాభా కొంత పెరుగుతుందని తెలిపారు. జపాన్లో 1.2, సౌత్ కొరియాలో 0.7 టీఎఫ్ఆర్ మాత్రమే ఉందని దీనివల్ల జనాభా తగ్గి మానవ వనరులు తగ్గిపోతాయని వెల్లడించారు. 1997లో ఏపీ పాపులేషన్ పాలసీ తీసుకొచ్చామని చెప్పారు. మన వద్ద 1992లో టీఎఫ్ఆర్ 3 ఉండగా ఇప్పుడు 1.5కు వచ్చిందని తమిళనాడులో 1.4 శాతం, కేరళలో 1.6, బిహార్లో 3 శాతం ఉందని తెలిపారు.

"మనం జోక్యం చేసుకోకుంటే టీఎఫ్ఆర్ వేగంగా తగ్గుతుంది. ఏడాదికి 6.70లక్షల మంది పిల్లలు ఏపీలో పుడుతున్నారు. 57 శాతం మంది ఒక్కరితో ఆపివేస్తున్నారు. 32శాతం మంది ఇద్దరిని కంటున్నారు. 9 శాతం మాత్రమే ఇద్దరి కంటే ఎక్కువ మందిని కంటున్నారు. 60 ఏళ్లు దాటిన వారు 10 శాతం ఉన్నారు. 2047కు ఇది 23 శాతానికి చేరుతుంది. మనవద్ద పనిచేసే మహిళలు తక్కువగా ఉన్నారు. 2023 లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఏడాదికి 6.70 లక్షల మంది పిల్లలు పుడుతున్నారు. 2047 నాటికి రాష్ట్రంలో వృద్ధాప్యం ఎక్కువగా ఉంటుంది. రాష్ట్రంలో 1.5 శాతంగా సంతానోత్పత్తి రేటు ఉంది. దేశంలో కంటే రాష్ట్రంలో వృద్ధాప్యం ఎక్కువగా ఉంది."- చంద్రబాబు, సీఎం


## డిజిటల్ మీడియా మిత్రులకు ఆహ్వానం

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన
డిజిటల్ మీడియా ఇతిక్స్ కోడ్ 2021
అమలు కోసం, మన ఆత్మ గౌరవం కోసం,
జర్నలిస్టులుగా గుర్తింపు కోసం,
ఖమ్మం గడ్డ నుండి ఉద్యమానికి కార్యాచరణ చేద్దాం

సమిష్టిగా చర్చించి
కార్యక్రమం రూపొందిద్దాం

ఇట్లు
టీ-మీడియా కుటుంబం
తెలుగు డిజిటల్
సెల్ : 8919710365

## ముఖ్య సమాచారం

టి మీడియా (తెలుగు డిజిటల్..ఛాలెంజ్)
టి మీడియా (తెలుగు డిజిటల్ ) అనుమతులు కుటుంబ సభ్యులు(రిపోర్టర్స్ తోసహా) వివరాలు /హోదా /ఫోన్ నంబర్ తో సహా. ఈ పేపర్ క్రింద ప్రతీ రోజు పేపర్ తో పాటు కన పడే విదంగా.ఆన్లైన్ లోపెట్టటం ప్రారంభం అయింది.

ఈ పని ఏ మీడియా
సంస్థ /ఇతర కార్పొరేట్ సంస్థ లు వారు చెయ్యరు./చెయ్యలేదు.

టి మీడియా గురించి చులకన మాట్లాడే వారికీ ఇదే మా ఛాలెంజ్..మీ మీడియా ఏంటీ..? మీ రు ఏంటి అనే ప్రతీ ఒక్కరిని..టి మీడియా ఈ పేపర్ గూగుల్ లో ఓపెన్ చెసి చూసు కొండి .

-యూట్యూబ్ /ఇనిస్టా /వెబ్ సైట్ లో కూడా పై వివరాలు పెట్టటం జరుగుతుంది.